


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 307 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 9 జూలై 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :307 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 9 JULY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## ఏపీ విద్యార్థులకు శుభవార్త.. డైట్ ఛార్జీలు 10% పెంపు

- హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు 10 శాతం డైట్ ఛార్జీల పెంపు
- రూ.100 కోట్లతో హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు
- ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు, మెరుగైన వసతులకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచన
- పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కంపెనీలకు సీఎం ఆదేశం
- కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని సూచన

- మిగతా 2లో

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన



- గత రాత్రి ఇరాన్‌పై భారీ దాడులు నిర్వహించామన్న ట్రంప్
- అవసరమైతే ఈరోజు అదే తరహాలో దాడులు చేస్తామని హెచ్చరిక
- ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడమే కారణమని వివరణ
- టర్కీలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన అధ్యక్షుడు

పెన్ పవర్ డెస్క్:అమెరికా మరోసారి ఇరాన్‌పై దాడులకు సిద్ధమవుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత రాత్రి భారీ దాడులు నిర్వహించామని తెలిపారు. అవసరమైతే మరోసారి కూడా అదే స్థాయిలో దాడులు చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

- మిగతా 2లో



## వైఎస్సార్ కు మరణం లేదు

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన షర్మిల
- వైఎస్ అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు అందాయని ప్రశంస
- ఆయన మరణం తట్టుకోలేక 700 మంది ఆయనతో పాటే వెళ్లిపోయారని వ్యాఖ్య

- మిగతా 2లో

## ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

### హ్యాసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

- బుసాన్‌లో హ్యాసంగ్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ క్లస్టర్ ప్రతిపాదన
- ఏపీలో ఆర్అండ్‌డీ, ఇన్నోవేషన్ సెంటర్ కోరిన మంత్రి
- దక్షిణ భారత తయారీ క్లస్టర్‌పై ప్రత్యేక ప్రతిపాదన
- కుప్పంలో రూ.900 కోట్ల ప్లాంట్‌ను గుర్తు చేసిన హ్యాసంగ్
- ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కంపెనీ హామీ



దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్.. ప్రముఖ హ్యాసంగ్ గ్రూప్ ఉన్నత స్థాయి ప్రతినిధులతో బుసాన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌వేర్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేలా పలు కీలక ప్రతిపాదనలు చేశారు.కుప్పంలో హ్యాసంగ్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినందుకు కంపెనీ ప్రతినిధులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అదే ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపొనెంట్, మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని వివరించారు.ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత కస్టమైజేషన్, సస్టెయినబుల్ మెటీరియల్స్‌పై పరిశోధనలు జరిగే నెక్స్ట్ జనరేషన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్

- మిగతా 2లో



## హిందూ మనోభావాలు ముఖ్యం కాదా?

- రావణ్‌కు వైసీపీ నేతలు మద్దతు తెలుపుతున్నారంటూ ఆనం మండిపాటు
- కోట్లాది మంది హిందువుల మనోభావాలు మీకు ముఖ్యం కాదా? అని ప్రశ్న
- ఎవరైనా సరే పరిధి దాటి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

- మిగతా 2లో



## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

### నిరంజన్ మృతిపై పవన్ కల్యాణ్ భావోద్వేగం

- అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ చిన్నారి నిరంజన్ మృతి
- గత నెలలోనే హనుమకొండకు వెళ్లి నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- చిన్నారి మనల్ని విడిచి వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన

పెన్ పవర్ డెస్క్:జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని, తెలంగాణలోని హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ నిన్న రాత్రి కన్నుమూశాడు. ఈ వార్త తెలియగానే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సోషల్ మీడియా వేదికగా

- మిగతా 2లో

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన జగన్
- తన తండ్రి ఆశీస్సులే తన ధైర్యం అంటూ ట్వీట్
- మిస్ యూ నాన్నా అంటూ భావోద్వేగం

పెన్ పవర్ డెస్క్:దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైసీపీ అధినేత జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. “మీరే నా స్ఫూర్తి.. మీ ఆశీస్సులే నా ధైర్యం.. మిస్ యూ నాన్నా” అంటూ జగన్ భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోలను పంచుకున్నారు.

- మిగతా 2లో



## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

- పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఫ్రీజ్
- కేర్‌వెల్ ఏవియేషన్ గ్రూప్‌తో లావాదేవీలపై దర్యాప్తు
- పార్టీ నిధులతో విమానం, హెలికాప్టర్ కొని లీజుకు తీసుకున్నట్లు ఆరోపణలు

పెన్ పవర్ డెస్క్:పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన 'కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్'కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్,

- మిగతా 2లో



## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

### గడ్కరీ ఘాటు కౌంటర్

- ఇథనాల్‌తో తనకు లాభం లేదన్న గడ్కరీ
- ఇథనాల్ ఉత్పత్తిలో తమ కంపెనీ వాటా కేవలం 0.07 శాతమేనని వెల్లడి
- ఆరోపణలను పూర్తిగా ఖండించిన కేంద్ర మంత్రి
- వాహనాలు దెబ్బతిన్నాయని ఆధారాలు చూపాలని సవాల్
- ఫిర్యాదులు వస్తే విచారణ చేస్తామని హామీ
- తనపై కుట్ర జరుగుతోందని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# జగన్ ధీమా ఏంటి? వచ్చే ఎన్నికల్లో గెలుద్దామంటే?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి కోటరీ గుప్పిట్లో చిక్కుకుంటున్నారు. ఆయన కూడా మాట మార్చడంలోనూ, మడమ తిప్పడంలోనూ ఆరితేరినట్లు కనిపిస్తుంది. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలో నడుస్తున్నానని చెప్పినప్పటికీ ఆచరణలో అది కనిపించడం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో వరసగా మాట మారుస్తున్న జగన్ కు విశ్వసనీయత లేదన్న అధికార పార్టీ నేతల విమర్శలను ఎవరైనా అంగీకరించాల్సిందే. 2014 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత ప్రతిపక్ష నేతగా జగన్ రాజధాని అమరావతిని నాడు సమర్ధించారు. అసెంబ్లీ వేదికగానే అమరావతిలో రాజధాని నిర్మాణానికి తన అంగీకారాన్ని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో విడిపోయిన రాష్ట్రానికి ఒక మంచి రాజధాని అవసరమని కూడా జగన్ అన్నారు.

**అధికారంలోకి రాగానే...**

కానీ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన సులవుగా మాట మార్చారు. కేవలం అమరావతిలోనే అభివృద్ధి జరిపితే మిగిలిన ప్రాంతాలు అన్యాయమైపోతాయని, అందువల్ల మూడు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. అమరావతి, విశాఖపట్నం, కర్నూలు ను మూడు రాజధానులుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో శాసన రాజధాని, కర్నూలులో న్యాయ రాజధాని, విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తామని చెప్పి అదే నినాదంతో 2024 ఎన్నికలకు జగన్ వెళ్లి బోల్తా పడ్డారు. 2024 ఎన్నికలలో పదకొండు స్థానాలు దక్కి ప్రతిపక్ష హోదా కూడా అధికారికంగా దక్కించుకోలేకపోయారు. అంటే మూడు రాజధానుల ప్రతిపాదనను నాడు మూడు ప్రాంతాల ప్రజలు సమర్థించలేదన్న విషయాన్ని అర్థమయిన జగన్ మళ్లీ మాట మార్చారు.

**అమరావతికి వ్యతిరేకం కాదంటూనే...**

ఇప్పుడు అమరావతి కు వైసీపీ వ్యతిరేకం కాదంటూనే వైఎస్ జగన్ అమరావతి పేరుతో చంద్రబాబు చేస్తున్న దోపిడీ కు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు మాత్రమే వ్యతిరేకం అని పేర్కొన్నారు. ఇప్పటికే సంపద సృష్టిస్తున్న నగరాలు మావిగన్ పేరును తెరపైకి తెచ్చారు. అమరావతి ఎప్పటికీ సంపద సృష్టించలేదని, వంద సంవత్సరాలు దాటిన కష్టమేనని చెప్పుకొచ్చారు. మావిగన్ అనేది 60 లక్షలు జనాభా ఉన్న ప్రాంతమని, అమరావతిలో కేవలం 29 గ్రామాల ప్రజలు మాత్రమే ఉన్నారని కొత్త నినాదం అందుకున్నారు. 9,536 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మావిగన్ ఉంటుందని, అమరావతి కేవలం 217 చదరపు కిలోమీటర్లు మాత్రమేనని అన్నారు.అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్ మాత్రమేనని, మౌలిక సదుపాయాలు అన్నీ కలిగినది మావిగన్ అంటూ కొత్త నిర్వచనం చెప్పారు. ఇది వినేవారికి మరో రాజకీయ అంశంగానే చూస్తారు. ఎందుకంటే అమరావతిలో ఇప్పటికే యాభై వేల కోట్ల రూపాయలతోపనులు ప్రారంభమయ్యాయి. మళ్లీ మావిగన్ ప్రతిపాదనతో ఎన్నికలకు వెళితే జగన్ అధికారంలోకి రాగలరా? అనే సందేహం వైసీపీ నేతల్లోనే వ్యక్తమవతుంది.

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు.. హ్వాసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

- మొదటి పేజి తరువాయి

ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు సేవలందించేలా సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఇందులో కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ కేంద్రం, విశాఖపట్నంలో డిజైన్, కార్పొరేట్, లాజిస్టిక్స్ విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే హ్వాసంగ్ ఫుట్‌వేర్‌కు చెందిన టైర్-1, టైర్-2 విక్రేతలతో ఏపీలో సప్లయర్ సమావేశం నిర్వహించాలని కోరారు.

సమావేశంలో హ్వాసంగ్ కార్పొరేషన్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్-రియోంగ్ స్పందించారు. కుప్పంలో రూ.900 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. అడిడాస్‌తో పాటు పలు అంతర్జాతీయ బ్రాండ్లకు ఓఈఎం సరఫరాదారుగా ఉన్న ఈ ప్లాంట్‌లో ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూలను తయారు చేయనున్నట్లు చెప్పారు.

మొదట ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని ఉత్పత్తి ప్రారంభిస్తామని, తర్వాత దేశీయ మార్కెట్‌కు కూడా విస్తరిస్తామని వెల్లడించారు. పుణే, చెన్నై, అనంతపురం జిల్లా గూడపల్లిలో ఆటో విడిభాగాల తయారీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# వైఎస్సార్ కు మరణం లేదు

తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'వైఎస్సార్ లెజెండరీ లీడర్. ఆయనకు మరణం లేదు' అని షర్మిల అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కేవలం 5 ఏళ్లు మాత్రమే పని చేసినా... ఆయన చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గడపకు అందాయని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలను వైఎస్సార్ మనసు పెట్టి అమలు చేశారని తెలిపారు. ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆ సమయంలో 700 మంది ఆయన వెంటే వెళ్లిపోయారని అన్నారు.

# హిందూ మనోభావాలు ముఖ్యం కాదా?

హిందూ దేవతలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రావణ్‌కు వైసీపీ నాయకులు మద్దతు తెలపుతున్నారంటూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి సచివాలయంలో మాట్లాడిన ఆయన, "కోట్లాది మంది హిందువుల మనోభావాలు మీకు ముఖ్యం కాదా? మత విద్వేషాలు రెచ్చగొడుతూ, హిందూమతాన్ని అవమానించిన రావణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దా?" అని వైసీపీ నేతలను నిలదీశారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ మతాన్ని తక్కువ చేసి మాట్లాడటం, సమాజంలో విచ్ఛిన్నానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి విద్వేషాలు రెచ్చగొట్టడానికి రావణ్‌కు గానీ, మాజీ సీఎం జగన్ కు గానీ ఎవరు అధికారమిచ్చారని ఆనం ప్రశ్నించారు. ఎవరైనా సరే పరిధి దాటి మాట్లాడితే ఊరుకునేది లేదని.. నోటికొచ్చినట్లు వాగితే కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి హెచ్చరించారు.

# ఏపీ విద్యార్థులకు శుభవార్త.. డైట్ ఛార్జీలు 10% పెంపు

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అందించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ పెంపును వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలన్న ఆర్థిక శాఖ సూచనను సీఎం తిరస్కరించారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంపు అమల్లోకి రావాలని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే వారికి అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ శాఖల సమీక్షలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. హాస్టళ్ల స్థానంలో మరిన్ని గురుకులాలు నిర్మించాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టు కింద ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సంక్షేమ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు.పొగాకు కొనుగోళ్లపై కూడా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కిలోకు రూ.200 కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని

కంపెనీలను ఆదేశించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. టొబాకో బోర్డు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే అవసరానికి మించి పొగాకు సాగు కావడం, ఎగుమతులు తగ్గడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని అధికారులు, కంపెనీల ప్రతినిధులు సీఎంకు వివరించారు.

## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది.

ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్‌పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

# నాన్నా.. మీరే నా స్ఫూర్తి

- మొదటి పేజి తరువాయి

ఇడుపులపాయలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు పలువురు వైసీపీ సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేదల సంక్షేమం, ఉచిత విద్య, వైద్యం, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల హృదయాల్లో నిలిచిన నేతగా రాజన్న ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని వారు స్మరించుకున్నారు.

## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

- మొదటి పేజి తరువాయి

'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు. ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం..

- మొదటి పేజి తరువాయి

టర్కీలోని అంకారాలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని ప్రస్తావించారు. గత రాత్రి తీవ్ర స్థాయిలో దాడులు నిర్వహించామని, అవసరమైతే ఈ రాత్రి కూడా అదే తరహా దాడులు చేస్తామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు కొనసాగుతుండటమే దీనికి కారణమని ఆరోపించారు.ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేసిన తర్వాత కాల్పుల విరమణ కొనసాగబోదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తన దృష్టిలో చర్చలు జరపడం వృథా అని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ చర్చలు కొనసాగించేందుకు అమెరికా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అయితే వాటి ఫలితాలపై మాత్రం సందేహం వ్యక్తం చేశారు.తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధం ముదిరుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు ఐదు శాతానికి పైగా పెరిగాయి. స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి.

# ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

- మొదటి పేజి తరువాయి

నిరంజన్‌ను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగాన్ని ఆయన వ్యక్తం చేశారు.

"నిరంజన్ ఇక లేదనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. కొద్దిరోజుల క్రితమే హనుమకొండలో వాళ్ల ఇంటికి వెళ్లి కలిసిన క్షణాలు ఇంకా నా కళ్లముందే కదలాడుతున్నాయి. అంతటి భయంకరమైన అనారోగ్యంతో పోరాడుతూ కూడా నన్ను చూడగానే ఆ చిన్నారి ముఖంలో విరిసిన చిరునవ్వు ఎప్పటికీ మరువలేని జ్ఞాపకం. శరీరం వ్యాధితో క్షీణిస్తున్నా... మనసు నిండా కొండంత ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అంతటి ధైర్యశాలి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం జీర్ణించుకోలేకపోతున్నా. ఆ చిన్నారి చూపిన ప్రేమ నా గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది" అంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు.

గత నెలలోనే నిరంజన్ అనారోగ్యం గురించి తెలుసుకున్న పవన్ కల్యాణ్ స్వయంగా హనుమకొండ వెళ్లి అతడిని పరామర్శించారు. ఆ సమయంలో నిరంజన్‌ను గుండెలకు హత్తుకుని, తిరుమల ప్రసాదం ఇచ్చి, సెల్ఫీ కూడా దిగారు. తనకు ఒక కుక్కపిల్ల కావాలని అడగ్గానే... ఆ రోజే కుక్కపిల్లను పంపించారు. అంతేకాదు, "నేను 'ఓజీ 2' తీస్తే అందులో నువ్వే నా స్పెషల్ గెస్ట్.. ఇద్దరం కలిసి సినిమా చూద్దాం" అని పవన్ మాట ఇచ్చారు. కానీ, ఈ లోపే చిన్నారి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఫ్యాన్స్ ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు, బాలీవుడ్ రియల్ హీరో సోనూ సూద్ సైతం నిరంజన్ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి పరామర్శించారు. ఆ కుటుంబానికి తానున్నానంటూ కొండంత ధైర్యాన్ని అందించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా


# జాతీయ ఐస్ హాకీలో శ్రీ ప్రజ్ఞ విద్యార్థులు ప్రతిభ




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 8:** డెహ్రాడూన్ లో జరిగిన జాతీయ ఐస్ హాకీ ఛాంపియన్ షిప్ 2026లో జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ హైస్కూల్ విద్యార్థులు అరుదైన ఘనత సాధించారు. సీరపు హరిప్రియ రెడ్డి 1 గోల్డ్, 1 బ్రాంజ్, సీరపు జస్వంత్ రెడ్డి బ్రాంజ్ మెడల్ సాధించి ప్రతిభ చాటారు. ఒకే పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, శ్రీ ప్రజ్ఞ అధినేత బండారు నాగబాబు అభినందించారు. అనంతరం జాతీయ విజేతలకు విద్యాసంస్థల డైరెక్టర్ తుమ్మల శ్వేత సాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, ప్రిన్సిపల్ కె.అభి, లక్ష్మీనారాయణ, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా హృదయాల్లో శిరస్మరణీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి.





-వైఎస్సార్ 77వ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి తోట నరసింహం.

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై, 8:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి,మాజీ ఎంపీ,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు తోట రాంజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైసీపీ ఎంపీపీ పాటంశెట్టి సత్యవతి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి తోట నరసింహం,తోట రాంజీ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు,కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తోట నరసింహం మీడియాతో మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. పాదయాత్ర ద్వారా ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపిన మహానేతగా ఆయనను అభివర్ణించారు. ఇందిరమ్మ ఇళ్లు, అభయహస్తం,వృద్ధులు,వితంతువులు,వికలాంగులకు పింఛన్లు,ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం,ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు ఉన్నత విద్య, 108, 104 అత్యవసర సేవలు, జలయజ్ఞం ద్వారా సాగునీరు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్సార్ అని పేర్కొన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ కోట్లాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని,ఆయన ఆశయాలే తమకు స్ఫూర్తి అని తోట నరసింహం అన్నారు. వైఎస్సార్ చూపిన బాటలోనే నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట బాబ్జి,ఆశపు బద్రి,అడబాల సుబ్బారాయుడు,బండారు విడి వర ప్రసాద్,ఆరిశ సత్యనారాయణ,భేరి బాబ్జి అధిక సంఖ్యలో కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా దివంగత నేత వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు






- అధిక సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ శ్రేణులు
- ఆకట్టుకున్న సేవా, సామాజిక కార్యక్రమాలు

**ఆలమూరు,పెన్ పవర్, జూలై 08;** రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు దివంగత మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు మండల కేంద్రమైన ఆలమూరులో బుధవారం ఘనంగా జరిగింది.

మండల కన్వీనర్, చెముడులంక గ్రామ మాజీ సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ లో నిర్వహించిన ఈ జయంతి వేడుకలకు పార్టీ సీనియర్ నేతలు చల్లా ప్రభాకరరావు, యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, నాంధ్ర నాగ మోహన్ రెడ్డి, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, మాజీ ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బారీ కేక్ ను కట్ చేసి పార్టీ శ్రేణులు ఒకరికొకరు తినిపించుకునీ తమ ఆనందాన్ని చాటుకున్నారు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్సీపీని అధికారంలోకి తీసుకువచ్చి మాజీ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాజన్న పాలనను తీసుకురావాలని నాయకులు స్థానిక కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

**పేదలకు దుప్పట్లు పంపిణీ**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేత చల్లా ప్రభాకరరావు సమకూర్చిన దుప్పట్లను ఈసందర్భంగా పార్టీ శ్రేణులు పేదలకు అందజేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అందరూ ర్యాలీగా వెళ్లి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులు నిర్వహించిన సేవా సామాజిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వైఎస్సార్సీపీ నాయకులు గుణ్ణం రాంబాబు, కట్టా శ్రీనివాస్, దియ్యాన పెదకాపు, ఉంద్రాసపు సుందరం విజయం, చల్లా నానాజీ, నాయుడు ప్రసాద్, గుత్తుల శ్రీనివాస్, చల్లా భూషణం, ఉండమట్ల బూరయ్య, కోలా నాని, పిల్లి ధనరాజు, గుత్తుల జయరాజు, గోపు నాగు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం.

-ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకటరావు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూలై, 8:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్తిపాడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోయ్యేటి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు,బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు108,రాజీవ్ ఆరోగ్యశ్రీ,పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్,నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని పేర్కొన్నారు. వైయస్సార్ సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను,డీసీసీ కార్యదర్శి దొంతం శెట్టి చంద్రశేఖర్,యూత్ నాయకులు పెద్దిరెడ్డి వీరబాబు,ప్రత్తిపాడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోయ్యేటి నారాయణ (నాని)తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జన హృదయ నేత వైయస్సార్ నాయకులకు మార్గదర్శకుడు.



ఏలేశ్వరంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 8:** జనహృదయనేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ నాయకులకే మార్గదర్శకుడు అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. దివంగత నేత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఏలేశ్వరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలకు చేసిన సేవలను మననం చేసుకున్నారు. తొలుత పాత బస్టాండ్ లో గల వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పట్టణ వైసిపి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చిన నాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. రైతులకు రుణమాఫీ చేసి రైతు బాంధవుడు అయ్యారు. ప్రజా సంక్షేమ పథకాలు వైయస్సార్ చేసిన విధంగా ఏ నాయకుడు మరలా చేయలేదన్నారు. రాజకీయ నాయకులకు వైయస్సార్ ఒక దిక్సూచి వంటివాడు అన్నారు. రైతుబంధుగా, ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసిన జన నేతగా ప్రజల హృదయాల్లో జ్వరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు అన్నారు. అనంతరం ఏలేశ్వరం కూడళ్ళలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాల వద్ద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి నాయకులు పైల అబ్బు, ఇజనగిరి ప్రసాద్ ,సామంతుల సూర్య కుమార్, దళే కిషోర్, బదిరెడ్డి శ్రీను, పైల విజయ్, కోరాడ ప్రసాద్, గొడుగు నాగేంద్ర, సిరిపురపు రాజేష్, రాచర్ల రమేష్, లోగిస్ శేఖర్, బత్తిన శ్రీను, నాయకులు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నవరంలో బోర్డులు ఉన్నా ఆగని వసూళ్ల దందా..

## అధికారుల మౌనం వెనుక ముడుపుల మర్మం!



**పెన్ పవర్, జూలై 8:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో కేశఖండన శాల లో జరుగుతున్న నిలువుదోపిడీపై భక్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం యాజమాన్యం అధికారికంగా "ఎటువంటి రుసుము చెల్లించరాదు" అని స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, అక్కడ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతూనే ఉండటం విస్మయానికి గురిచేస్తోంది.

**ప్రధానాంశాలు:**

నిబంధనల ఉల్లంఘన: అధికారికంగా కేశఖండన సేవ ఉచితం లేదా నిర్ణీత రుసుముకే పరిమితం కావాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో సిబ్బంది భక్తుల నుండి వంద రూపాయల చొప్పున బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు.

అధికారుల మౌనం - ముడుపుల అనుమానం: ఇంత బహిరంగంగా అక్రమ వసూళ్లు జరుగుతున్నా, పర్యవేక్షించాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదు? అధికారులకు కూడా ముడుపులు అందుతున్నాయని, అందుకే వారు అక్రమార్కులను వెనకేసుకొస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిసి ఫుటేజ్ పరిశీలించడంలో జాప్యం: కేశఖండన శాల వద్ద ఉన్న సిసి కెమెరా ఫుటేజీని పరిశీలిస్తే, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బంది ఎవరో, వారికి సహకరిస్తున్న వారెవరో ఇట్టే తెలిసిపోతుంది. కానీ, అధికారులు సిసి ఫుటేజ్‌ను పరిశీలించడానికి ఎందుకు వెనుకాడుతున్నారో అర్థం కావడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

**డిమాండ్లు:**

తక్షణ విచారణ: దేవస్థానం అధికారులు తక్షణమే సిసి కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి.

అవినీతి రహిత క్షేత్రం: బోర్డులు కేవలం మొక్కుబడికి కాకుండా, క్షేత్రస్థాయిలో ఆచరణలోకి వచ్చేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

జవాబుదారీతనం: అక్రమ వసూళ్లను అరికట్టడంలో విఫలమైన అధికారుల పాత్రపై ఉన్నత స్థాయి విచారణ జరగాలి. భక్తుల సొమ్మును దోచుకుంటున్న సిబ్బందిని, వారికి మౌనంగా సహకరిస్తున్న అధికారులను తక్షణమే బాధ్యులను సస్పెండ్ చేయాలని , భక్తులు కోరుకుంటున్నారు.


01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# దొండపాటి మేరీ కుటుంబానికి జనసేన నాయకుడు తలపంటి బుజ్జి అండ....

- 50 కేజీల బియ్యం,ఆర్థిక సాయం అందజేత
- నెల్లిపూడిలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న బుజ్జి



**శంఖవరం పెన్ పవర్ జులై 08:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన దొండపాటి బుచ్చిబాబు భార్య దొండపాటి మేరీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని శంఖవరం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు దొండపాటి అబ్బులు, లోవమ్మ, దాసుబాబు, వరలక్ష్మి, రుతమ్మలను ఓదార్చి వారికి 50 కిలోల బియ్యంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో పార్టీ నాయకులు అండగా ఉంటారని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిర్ల ధర్మరాజు, కోటిపల్లి ప్రసాద్, చిట్టుమూరి కామరాజు, రాచపల్లి శ్రీను, నొక్కి వీరబాబు, నొక్కి కొండబాబు, వర్రి అప్పారావు తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కత్తిపూడిలో మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు....





**శంఖవరం పెన్ పవర్ జులై 08:-** దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడిలో పండగ వాతావరణం నెలకొంది. వైస్సార్సీపీ శ్రేణులు ముందుగా కత్తిపూడిలో కృష్ణుడి గుడి వద్ద ఉన్నటువంటి వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కొత్తూరులో వైయస్సార్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి మహానేత ను స్మరించుకున్నారు. వైస్సార్సీపీ ముఖ్య నేతలు మాట్లాడుతూ చరిత్రలో ఓటమి ఎరుగని ఒకే ఒక్క నాయకుడు మహనేత వైయస్సార్ అని కొనియాడారు.

వైయస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చేసిన ఆరోగ్య శ్రీ, 108 అంబులెన్సు ఫీజు రియింబుర్న?స్మెంట్ లాంటి ఎన్నో గొప్ప సంస్కరణములు పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన గొప్ప నాయకుడు వైస్సార్ అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గౌతు స్వామి, కూచిమంచి ప్రకాష్, అడపా సోమేశ్, పెయ్యల కృష్ణ, చల్లా ప్రసాద్, చొప్పా రాంబాబు, సకురు గుర్రాజు, గౌతు వాసు, పెయ్యల నూకరాజు, సింగంపల్లి రాంబాబు, కొయ్య వెంకట రమణ, నమ్మి తాతారావు, దేవర సన్యాసి రావు, మడికి ప్రకాష్, మిరియాల పద్మావతి, మందాల శ్రీను, బేత ఏసుబాబు, కొత్తేశీ బుజ్జి, కేలంగి ప్రసాద్, ఐతు నాగేశ్వరరావు,ఆకుల రాంబాబు, పెయ్యల చక్రం వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# అన్నవరం సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ. 1,00,116 విరాళం



**అన్నవరం: పెన్ పవర్ జూలై 8.** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి భారీ విరాళం అందింది. తుని వాస్తవ్యులు డాక్టర్ అల్లు హరికృష్ణ స్వామివారి అన్నదాన నిధికి రూ. 1,00,116/- (లక్షా నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు.

బుధవారం దేవస్థాన కార్యాలయంలో డాక్టర్ హరికృష్ణ తన విరాళానికి సంబంధించిన నగదు/చెక్ మొత్తాన్ని దేవస్థానం కార్యనిర్వాహక అధికారి (ఈవో) నల్లం సూర్యచక్రధర్ రావుకు నేరుగా అందజేశారు. తాను అందజేసిన ఈ విరాళంపై వచ్చే వడ్డీతో, ప్రతి ఏటా మే 19వ తారీఖున స్వామివారి భక్తులకు అన్నదానం జరిపించవలసిందిగా ఈ సందర్భంగా దాత కోరారు.

దేవస్థానానికి విరాళం అందించిన దాత డాక్టర్ హరికృష్ణను ఈవో నల్లం సూర్యచక్రధర్ రావు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం దాతకు శ్రీ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భవితా కేంద్రం పనితీరుపై ఏపీసీ సత్యనారాయణ ప్రశంస

- కాజులూరు మోడల్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో ముచ్చట.. విద్యా ఫలితాలపై సంతృప్తి



**కాజులూరు, పెన్ పవర్,జూలై 8:** కాజులూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌లోని దివ్యాంగుల భవితా కేంద్రాన్ని సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు వి.వి.వి. సత్యనారాయణ ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా భవితా కేంద్రంలోని విద్యార్థుల అభ్యసన ఫలితాలను పరిశీలించి,వారి ప్రతిభను ప్రశంసించారు.చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం,ఆసక్తుల గురించి తెలుసుకున్నారు.భవితా కేంద్రం నిర్వహణ, సాఫల్యాలు,ఎదురవుతున్న సవాళ్లపై సిబ్బందితో చర్చించిన ఏపీసీ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పలు సూచనలు, మెళకువలను వివరించారు. ఇటీవల ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకుని విశేష ప్రతిభ కనబరిచిన గొల్లపాలెం విద్యార్థిని సాయి రూపాశ్రీని ప్రత్యేకంగా అభినందించారు.భవితా కేంద్ర సిబ్బంది ఎం.జయప్రకాశ్,శివ ఓంపోలు అందిస్తున్న సేవలను ఏపీసీ ప్రశంసిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, విద్యార్థులకు గుడ్లు,చిక్కీలు తదితర పోషకాహారం సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం కాజులూరు మండల విద్యాశాఖ కార్యాలయం (ఎంఈవో కార్యాలయం/ఎంఆర్సీ), పీఎం జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి మిగులు బడ్జెట్,విద్యా ఫలితాలు, పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఆల్సో రాంబాబు,కాజులూరు మండల విద్యాశాఖ అధికారులు డేవిడ్,జాన్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సుపరిపాలన కావాలంటే జగన్ సీఎం అవ్వాలి





**మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు**

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 8:** వైయస్సార్ సుపరిపాలన కావాలంటే భవిష్యత్తులో మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అయితేనే సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత జ్యోతుల చంటిబాబు అన్నారు. బుధవారం వైయస్సార్ జయంతి సందర్భంగా జ్యోతుల చంటిబాబు ఇంటి వద్ద నుంచి వైయస్సార్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ విగ్రహానికి చంటిబాబు పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండేవారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వస్తే మంచి రోజులు వస్తాయన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా బలపరిచి వైయస్సార్ సిపి ప్రభుత్వం ఏర్పాటుకు కార్యకర్తలంతా కృషి చేయాలని చంటిబాబు పేర్కొన్నారు. అనంతరం చంటిబాబు ఇంటి వద్ద కార్యకర్తలకు భారీ ఎత్తున భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బండారు రాజా, కంచి లక్ష్మణదొర, అప్పారావు కాపు, పెద్దకాపు, దోమల గంగాధర్, బుదిరెడ్డి చక్రారావు, పెంట కొండ నాగబాబు, నాగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్



**వైసిపి ఇన్చార్జి తోట నరసింహం**

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 8:** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అని మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోట నరసింహం అన్నారు. బుధవారం వైయస్సార్ 77వ జయంతి వేడుకలను జగ్గంపేట బాలాజీ నగర్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జగ్గంపేట సెంటర్లో గల వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, స్వీట్లు పంచిపెట్టడం, కేక్ కటింగ్ ఘనంగా నిర్వహించారు. తోట నరసింహం మీడియాతో మాట్లాడుతూ పేదల కోసం పుట్టిన వైఎస్ఆర్ ప్రజారాజ్యం అంటే ఏమిటో ప్రజలకు చూపించిన నాయకుడుగా పాదయాత్ర ద్వారా ప్రతి గడప తొక్కి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారమార్గం చేసిన నేతగా ఎదిగారన్నారు. ఆయన లేని లోటు రాష్ట్రానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# చికెన్ కూర వండలేదని మహిళ హత్య



**నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష**

**కాకినాడ, పెన్ పవర్,జూలై 8:** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ స్వీయ పర్యవేక్షణలో మర్డర్ కేసుల విచారణను వేగవంతం చేస్తున్న నేపథ్యంలో మరో కీలక హత్య కేసులో జిల్లా పోలీసులు విజయవంతమైన తీర్పు సాధించారు. 2020లో జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ 4వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్. సరస్వతి బుధవారం తీర్పు వెలువరించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. రంపచోడవరం ప్రాంతానికి చెందిన తోకల వెంకటేశులు జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామంలోని మామిడి--జీడి తోటలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ, తనతో సహజీవనం చేస్తున్న నేశం లక్ష్మిని 2020 మార్చి 28న చికెన్ కూర వండలేదనే కారణంతో కర్రతో తీవ్రంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో ఆమె స్వగ్రామానికి తరలించి నేర ఆనవాళ్లను తొలగించేందుకు ప్రయత్నించాడు.మృతురాలి కుమారుడు నేశం బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 86/2020గా ఐపీసీ సెక్షన్లు 302, 201 కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ వై. రాంబాబు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నిందితుడిని 2020 ఏప్రిల్ 6న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.విచారణ సందర్భంగా ప్రభుత్వ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వినయ తేజ సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కోర్టు నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించింది.దీంతో సెక్షన్ 302 కింద యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, సెక్షన్ 201 కింద మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది.ఈ సందర్భంగా కేసు దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించిన అప్పటి దర్యాప్తు అధికారి వై. రాంబాబు,అప్పటి పెద్దాపురం ఎస్‌డీపీఓ ఎ.శ్రీనివాసరావు, ప్రస్తుత ఎస్‌డీపీఓ ఎ.బి.జి.తిలక్,జగ్గంపేట సీఐ బి. తిరుపతిరావు,ఎస్ఐ టి. రఘునాథరావు, కోర్టు లైజన్ ఆఫీసర్ డి.ఎన్.ఎస్.డి.సాయి వెంకటేశ్వరరావు, కోర్టు పీసీ డి.నరేష్,అలాగే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వినయ తేజలను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఏపీఎస్ పీ 4వ బెటాలియన్‌లో ఘనంగా వన మహోత్సవం



**కాకినాడ రూరల్, పెన్ పవర్ జూలై 8:** కాకినాడ రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఏపీఎస్పీ 4వ బెటాలియన్ క్యాంప్‌లో బుధవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బెటాలియన్ ఆవరణలో 600 మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో) ఎన్.రామచంద్రరావుకు బెటాలియన్ కమాండెంట్ కె.నవీన్ కుమార్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు.అనంతరం కమాండెంట్, డీఎఫ్‌వోతో పాటు అధికారులు,సిబ్బంది బెటాలియన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా డీఎఫ్‌వో ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పచ్చదనమే ప్రధాన ఆధారమని,ప్రతి ప్రభుత్వ సంస్థ వర్షాకాలంలో విస్తృతంగా మొక్కలు నాటి జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని సూచించారు.కమాండెంట్ కె.నవీన్ కుమార్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా బెటాలియన్ ప్రాంగణంలో 600 మొక్కలు నాటుతున్నామని,ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమానికి సహకరించిన జిల్లా అటవీశాఖ అధికారులు,సిబ్బంది, బెటాలియన్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు డి.డి.గంగరాజు,బి.ఎన్.సి.శేఖర్ రావు,ఎం.మోహన్ రావు,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.ఎం.వి.మోహనరావు, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మి,డాక్టర్ శ్రీరామ్, ఆర్ఐలు అజయ్ కుమార్,బి.శ్రీనివాసరావు,డి.రాజు,రవిశంకర్,వ ఝరళీమోహనరావు,రాము,హరిబాబు తదితర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు





✷ స్వామివారినిచ్చే అన్నదానానికి భక్తుల విరాళం

**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 8:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ చందన వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి బుధవారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకున్నారు. ఏడువారాల వెంకన్నగా విరాజిల్లుతున్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర శతనామార్చన, నిత్య కల్యాణోత్సవం తదితర ఆర్జిత సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే ఆలయ సన్నిధిలో కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేశారు.రాజమహేంద్రవరం నగరానికి చెందిన నీలం వీరభద్రరావు-- విరాజ కుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు చిరంజీవి సాయి సుమంత్, శ్రీధర్, మృదుల, సహస్ర కలిసి నిత్య అన్నదాన పథకానికి రూ.1,01,116/- విరాళంగా సమర్పించారు.అలాగే కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన కంతంశెట్టి సత్య కృష్ణ--లలిత నాగ పూర్ణిమ దంపతులు, వారి కుటుంబ సభ్యులు చిరంజీవి హర్ష నాగ వెంకట గౌతమ్ కలిసి రూ.50,000/- విరాళాన్ని అందజేశారు.విరాళాలు సమర్పించిన దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు, ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి సత్కరించారు.






## తెలంగాణ మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే బండారు భేటీ



**కొత్తపేట,పెన్ పవర్, జూలై 8:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన పర్యటనలో భాగంగా కొత్తపేట నియోజకవర్గానికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును చింతం కృష్ణ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపికగా మొక్కను అందజేసి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఇద్దరు నేతలు ఆప్యాయంగా పలకరించుకుని పలు అంశాలపై చర్చించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా పనిచేసిన సమయంలో కలిసి పనిచేసిన సందర్భాలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో జరిగిన పలు రాజకీయ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అనుభవాలను ఇద్దరూ పరస్పరం స్మరించుకున్నారు.అనంతరం నియోజకవర్గ అభివృద్ధి, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలు, తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాల్సిన అవసరంపై కూడా వారు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.

## మందపల్లి మందేశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ మంత్రి తుమ్మల





**కొత్తపేట,పెన్ పవర్,జూలై 8:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని మందపల్లి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవస్థానం సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి, శాస్త్రోక్తంగా తైలాభిషేకం నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆశీర్వచనాలు అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో మంత్రిని సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పనిచేసిన రోజులు తనకు గుర్తున్నాయని తెలిపారు. శ్రీ మందేశ్వర శనేశ్వర స్వామివారిపై తనకు ఎంతో విశ్వాసం ఉందని, చాలాకాలం తర్వాత స్వామివారిని దర్శించుకునే భాగ్యం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.స్వామివారి అనుగ్రహంతో తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు మంత్రి పేర్కొన్నారు. దర్శన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించగా, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## జగ్గంపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు కావాలి

కమిషనర్ కృష్ణ తేజకు వినతి అందజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 8 :** అమరావతి సచివాలయంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం కలిసారు. జగ్గంపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, గ్రామీణ రహదారుల అభివృద్ధికి తక్షణమే నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల దుస్థితి, తాగునీటి సమస్యలు, డ్రైనేజీ, వీధి దీపాలు, సామాజిక భవనాల కొరత ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిద్దేందుకు ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని కోరారు. జగ్గంపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కమిషనర్ కృష్ణ తేజ సానుకూలంగా స్పందించి, జగ్గంపేట నియోజకవర్గ అవసరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు.

## పసివాడి ప్రాణం నిలిపిన సూర్యోదయ సంస్థ...






'ఓ నెగటివ్' రక్తం అందించి మానవత్వం చాటుకున్న సభ్యుడు

**శంఖవరం పెన్ పవర్ జులై 08:-** తలసేమియా వ్యాధితో బాధపడుతూ, అరుదైన గ్రూపు రక్తం దొరకక ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక మూడేళ్ల పసివాడికి సూర్యోదయ సంస్థ ఆపద్బాంధవుడిలా అండగా నిలిచింది. సకాలంలో స్పందించి రక్తదానం చేయడం ద్వారా ఆ చిన్నారి జీవితంలో వెలుగులు నింపింది.

వివరాల్లోకి వెళ్తే

నాతవరం ప్రాంతానికి చెందిన వి. జస్వంత్ అనే మూడు సంవత్సరాల బాలుడు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి కారణంగా బాలుడికి ప్రతి 23 రోజులకు ఒకసారి తప్పనిసరిగా రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం తునిలోని మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఈ బాలుడికి అత్యవసరంగా 'ఓ నెగటివ్' రక్తం అవసరమైంది.

అయితే, ఈ గ్రూపు రక్తం చాలా అరుదైనది కావడంతో విశాఖపట్నం, కాకినాడ మరియు వాటి పరిసర ప్రాంతాల్లోని బ్లడ్ బ్యాంకులు తిరిగినా ఎక్కడా రక్తం లభించలేదు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

వెలుగు నింపిన 'సూర్యోదయ' సంకల్పం:

ఈ క్లిష్ట పరిస్థితిలో బాలుడి కుటుంబం సూర్యోదయ స్వచ్ఛంద సంస్థను సంప్రదించింది. విషయం తెలుసుకున్న వెంటనే సంస్థ సభ్యులు సానుకూలంగా స్పందించారు. సూర్యోదయ సంస్థ సభ్యుడు రామకృష్ణ ఏమాత్రం ఆలస్యం చేయకుండా కాకినాడలోని వీనస్ బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని బాలుడి కోసం రక్తదానం చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానమనే సంకల్పంతో ఎంతోమంది ప్రాణాలు రక్షిస్తున్న సూర్యోదయ సంస్థను, సకాలంలో స్పందించి పసివాడి ప్రాణాలు నిలిపిన రామకృష్ణ ని హాస్పిటల్ సిబ్బంది, బాలుడి తల్లిదండ్రులు మరియు స్థానికులు అభినందన లతో ముంచెత్తారు. తలసేమియా పిల్లల పట్ల సూర్యోదయ సంస్థ అందిస్తున్న సేవలు ఎప్పటికీ మరువ లేనివని కొనియాడారు.

## కార్తీక మాసం లోపు 'ప్రసాదం' పథకం పనులు పూర్తి చేయాలి: దేవస్థానం ఈఓ సూర్యచక్రధరరావు



**అన్నవరం:పెన్ పవర్ జూలై 8:**రత్నగిరిపై ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ 'ప్రసాదం' పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను అత్యంత వేగంగా పూర్తి దేవస్థానం కార్యనిర్వహణాధికారి . ఈవో సూర్యచక్రధరరావు అధికారులను ఆదేశించారు. రాబోయే పవిత్ర కార్తీక మాసం లోపు ఈ పనులను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు.

దేవస్థాన ఈఓ కార్యాలయంలో ఏపీ టూరిజం మరియు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో ఆయన ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

పనుల పురోగతిపై సుదీర్ఘ చర్చ

ఈ సమావేశంలో 'ప్రసాదం' పథకంలో భాగంగా నిర్మాణంలో ఉన్న నూతన అన్నదాన భవనం (అన్నప్రసాదం బిల్డింగ్) మరియు భక్తుల క్యూ లైన్ల పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. పనులను ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అత్యంత పవిత్రమైన, భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే కార్తీక మాసం ప్రారంభమయ్యే లోపే ఈ నిర్మాణాలను దేవస్థానానికి అప్పగించాలని కోరారు.

దీనికి స్పందించిన ఏపీ టూరిజం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.. ఈ పనులను పూర్తిగా ముగించడానికి మూడు నెలల కాలపరిమితి కావాలని ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల సౌకర్యార్థం ఈ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి ఏపీ టూరిజం మరియు దేవస్థానం ఇంజనీరింగ్ విభాగాలు సంయుక్తంగా, పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఈఓ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సమావేశంలో పాల్గొన్న ముఖ్యులు:

ఈ ఉన్నత స్థాయి సమీక్షలో దేవస్థానం ఈఓ శ్రీ సూర్యచక్రధరరావుతో పాటు ఏపీ టూరిజం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డై ఈఈ) శ్రీ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) శ్రీ వెంకటేష్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ ఈ) శ్రీ రామకృష్ణ, ఈఈ శ్రీమతి/ నూకరత్నం గారితో పాటు పలువురు డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఐదు బుధవారాల దర్శనంతో కోరికలు నెరవేరుతాయనే విశ్వాసం.. జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో భక్తుల రద్దీ







**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 8:**ఐదు బుధవారాలు శ్రీ జగన్మోహిని కేశవస్వామిని దర్శించుకుంటే భక్తుల కోరిన కోరికలు, ముఖ్యంగా సంతాన ప్రాప్తి కలుగుతుందనే ప్రగాఢ విశ్వాసంతో బుధవారం ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

వేకువజామున స్వామివారి సన్నిధిలో మేలుకొలుపు సేవ, అల అలంకారుణోత్సవం, సుప్రభాత సేవలను వైభవంగా నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. తణుకు పట్టణానికి చెందిన తాడికొండ రామమూర్తి--అపర్ణజ్యోతి దంపతులు రూ.10,116 విరాళంగా సమర్పించగా, రాజమహేంద్రవరానికి చెందిన జక్కంపూడి రాహుల్ దత్త--శ్రావ్య దంపతులు కూడా రూ.10,116 విరాళంగా అందజేశారు.ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ దాతలను స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో సత్కరించారు.

# ఏలేశ్వరం మండలం ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం.







**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 8:** ఏలేశ్వరం మండలం ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రెసిడెంట్ గా ఎండి అధికార్, శక్రటరీగా దొంతంశెట్టి సతీష్, ట్రెజరర్ గా పారేపల్లి గంగా ప్రసాద్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా తొలుత గతంలో స్వర్ణ పూడి శ్రీనివాసరావు ప్రెసిడెంట్ గా ఏర్పడిన కమిటీ పదవీకాలం ముగియడంతో, కమిటీ సభ్యుల ఆమోదం మేరకు కమిటీని రద్దు చేశారు.
అనంతరం మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కె వి వి ఏ ఎస్ పట్నాయక్, సీనియర్ పాత్రికేయుడు కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల ప్రక్రియకు సీనియర్ పాత్రికేయుడు శిడగం మాధవ పర్యవేక్షకుడు గా వ్యవహరించారు. ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, పత్రి వాసు, కోరాడ నానాజీ, అడపా దుర్గారావు, ముప్వల శ్రీనివాసరావు, పోతుల లోవరాజు, కొల్లిపర దుర్గా శ్రీనివాసరావు, గొల్లపల్లి రాజబాబు, కట్టా శ్రీనివాసరావు, వక్కలంక రామ్ ప్రసాద్, షేక్ ఇమ్రాన్ తదితరులు విలేకరులు పాల్గొన్నారు.

# ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 8:** జగ్గంపేట గ్రామ శివారున రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావుకి వచ్చిన సమాచారం మేరకు బుధవారం జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5060 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామని కోర్ట్ లో హాజరు పరుస్తామన్నారు. జగ్గంపేట మండల పరిధిలో ఎక్కడైనా రహస్యంగా కోడిపందాలు, పేకాట, జూదాలు నిర్వహించినట్లయితే జగ్గంపేట సీఐ 9440796529, జగ్గంపేట ఎస్సై 9440796569 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్సై రఘునాథరావు తెలిపారు.

# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ సేవలపై అవగాహన




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 8:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో వాణిజ్యశాఖ (కామర్స్ విభాగం) మరియు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, జగ్గంపేట సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలు మరియు సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, జగ్గంపేట శాఖ మేనేజర్ కె.విష్ణువర్ధన్, క్యాషియర్ వి.రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖ మేనేజర్ విష్ణువర్ధన్ విద్యార్థులకు బ్యాంకులు అందిస్తున్న వివిధ సేవలు, జీరో బ్యాలెన్స్ ఖాతాలు, డిజిటల్ బ్యాంకింగ్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి ఆధునిక సేవల గురించి వివరించారు. అదేవిధంగా ఆన్లైన్ బ్యాంకింగ్కు సంబంధించిన సైబర్ నేరాలు, మోసాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఓటీపీ, పిన్, పాస్వర్డు, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో విద్యార్థులకు జీరో బ్యాలెన్స్ బ్యాంక్ ఖాతాలను ప్రారంభించి, బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందేందుకు అవసరమైన సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.?

# అంబేద్కర్ కాలనీలో విద్యార్థి విభాగం కార్యదర్శి. పిఎస్.భరత్ ఆధ్వర్యంలో 77వ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు....





**శంఖవరం పెన్ పవర్ జులై 08:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం శంఖవరం స్థానిక ఎస్సీ కాలనీలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి ఉత్సవాలు కాకినాడ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి. పిఎస్.భరత్. ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. విభాగం కార్యదర్శి. పిఎస్.భరత్ మాట్లాడుతూ
చరిత్రలో ఓటమి ఎరుగని ఒకే ఒక్క నాయకుడు మహనేత వైయస్సార్ అని కొనియాడారు.
వైయస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చేసిన ఆరోగ్య శ్రీ, 108 అంబులెన్సు ఫీజు రియింబర్స్?స్మెంట్ లాంటి ఎన్నో గొప్ప సంస్కరణములు పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన గొప్ప నాయకుడు వైస్సార్ అని తెలియచేసారు.
ఈ కార్యక్రమాని కి,శంఖవరం మండల బిఎల్ఎ కన్వీనర్ పడాల సతీష్ పాల్గొన్నారు. పిల్ల దేవుడమ్మ, బోడపాటి మని బాబు, బందిలి కొసరాజు, బత్తిని చిన్ని, సికోలు సింహాచలం, వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

# జనసైనికుడు గ్రంధి సుబ్రహ్మణ్యం వివాహ రిసెప్షన్‌కు హాజరైన జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి



**గండేపల్లి , పెన్ పవర్, జూలై,08:**జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారి గ్రామానికి చెందిన జనసైనికుడు గ్రంధి సుబ్రహ్మణ్యం వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను, సూరంపాలెం బాలు, నల్లల శివ, అంకం ఓం కృష్ణ,ఓంకార్, స్వామి, కొలమూరు భద్ర, కొలమూరి బుజ్జి, గోకేడ పండు,పొనగంటి వీరబాబు జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అన్నవరం దేవస్థానంలో బయోగాస్ ప్లాంట్ ఏర్పాటుకు కసరత్తు.. హైదరాబాద్ శాస్త్రవేత్తల బృందం పరిశీలన!



**అన్నవరం:పెన్ పవర్ జూలై 8**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణే లక్ష్యంగా గోబర్ధన్ (జీవ వాయువు) ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ భారతీయ రసాయన సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐసిటి) ప్రతినిధుల బృందం బుధవారం అన్నవరం దేవస్థానాన్ని సందర్శించింది.
కార్యనిర్వహణాధికారితో శాస్త్రవేత్తల భేటీ
దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) కె. సూర్య చక్రధర రావు గారిని ఈ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆలయంలో గోబర్ధన్ జీవ వాయువు ప్లాంట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.
వ్యర్థాల నుంచి గ్యాస్ ఉత్పత్తి
స్వామివారి నిత్య అన్నదాన పథకంలో మిగిలిపోయే ఆహార వ్యర్థాలు, పూజా కార్యక్రమాల్లో ఉపయోగించే పూలు, పత్రి, అలాగే దేవస్థాన పరిధిలోని ఇతర తడి వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో పునరుత్పత్తి చేసి జీవ వాయువుగా ఎలా మార్చవచ్చో ఈ బృందం కార్యనిర్వహణాధికారి గారికి వివరించింది. దీనివల్ల వ్యర్థాల సమస్య తీరడమే కాకుండా, దేవస్థానానికి ఇంధన ఖర్చులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు.
వంటశాల, గోశాలల పరిశీలన ఈ ప్లాంట్ ఏర్పాటుకు కావలసిన వనరులు, అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు ఈ బృందం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది.
నిత్య అన్నదాన వంటశాల: రోజువారీగా ఇక్కడ ఎంత వ్యర్థాలు వస్తాయనేది అంచనా వేశారు.
దేవస్థానం గోశాల: గోశాల నుంచి లభించే పేడను జీవ వాయువు ఉత్పత్తికి ఎలా ఉపయోగించవచ్చో పరిశీలించారు.
సందర్శన అనంతరం ప్లాంట్ ఏర్పాటుకు గల అనుకూలతలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను రూపొందించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఉన్నతాధికారులు

# ధర్మవరంలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు.

-200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేసిన ముదునూరి.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూలై, 8:**ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ముదునూరి మురళీకృష్ణంరాజు నివాసం వద్ద మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు.మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం భారీ కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు,నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు 200 మంది పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.మహానేత వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, సీంద్రిపు భాస్కరరావు, బొల్లు సీతారామరాజు, కిల్లాడి బాబ్జి, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, గొనగాల అజయ్, జువ్వల సత్యనారాయణ, కోన బాబ్జి, దొడ్డిపట్ల కృష్ణ, బొల్లు రాజబాబు, గదుల శివ, సిద్ధా అప్పలరాజు, సిద్ధా బాబ్జి, కేసరపు శ్రీను, దాడి శ్రీను, దోమలంక బాబ్జి, యాళ్ల ఏసుబాబు , జువ్వల ముసలయ్య, కాపరపు బుజ్జి, తిమ్మిశెట్టి రాజా, బలిజీ వీర్రాజు, దాడి పుత్రయ్య, పెండ్యాల అబ్బు, కొప్పిన నరసింహమూర్తి, బొల్లు నల్లఅబ్బాయి, బొల్లు బాబ్జి, మర్రి సుబ్బారావు, దొడ్డిపట్ల శివ, సింగలూరు శేఖర్, దడాల అప్పారావు, కుడుముల శ్రీను, మారెళ్ల అన్నప్పబాబు, జువ్వల రాజు, ఎంటిపల్లి త్రిమూర్తులు, సింగులూరి నాగభూషణం, అంబటి సత్తిబాబు తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళలు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పామాయిల్ రైతులు ఆందోళన



**గండేపల్లి,పెన్ పవర్,జులై,08:** ప్రభుత్వం ఇచ్చిన జీవో ను ధిక్కరించి ఫ్యాక్టరీ యజమానులు కోర్టుకు వెళ్లడం అన్యాయం అని గండేపల్లి మండలం ఉప్పలపాడు పామాయిల్ రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఇచ్చిన ప్రతి జీవోను అమలు చేసిన సంఘటనలు ఇప్పటివరకు జరిగాయి. ప్రభుత్వం రైతులకు ఆరుతడి పంటలు ప్రోత్సహించడం కోసం పామ్ ఆయిల్ రైతులకు పెట్టుబడి మరియు లాభాలు ఆశించడం కోసం ప్రభుత్వం కృషి చేసి టన్నుకు సుమారు 23 వేల 750 రూపాయలు రేటును అందజేస్తుందన్నారు. అయితే కొన్ని పామాయిల్ పరిశ్రమలు ఇప్పటివరకు టన్ను కు 20 శాతం దిగుబడి వచ్చే ఆయిల్ ధరను 2 శాతం తగ్గించి (18%) తగ్గించాలని కోర్ట్ కు వెళ్లడం జరిగిందన్నారు. 18 శాతం ధర అయితే 2 వేల నుండి 2 వేల 500 రూపాయల వరకు పామాయిల్ రైతులు నష్టపోతారన్నారు.రాష్ట్ర రైతు సంఘం పామాయిల్ రైతులు అందరి తరపున రైతులకు మద్దతుగా పోరాటం సాగిస్తుంది అన్నారు. పాత జీవోను కొనసాగిస్తూ రాష్ట్ర రైతు సంఘాలకు మద్దతుగా బుధవారం ఆందోళన చేపట్టారు. పామాయిల్ రేటు కోసం మన రాష్ట్రంలోనే ఈ వరవడి సాగుతుందని, మిగతా రాష్ట్రాలలో ప్రభుత్వం నిర్ణయించిన రేటు అమలు చేస్తున్నారని మిగతా రాష్ట్రాలలో ఏ పరిశ్రమలు కోర్టులను ఆశ్రయించలేదని రైతులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గెడ్డం అమ్మి రాజు,గెడ్డం బూరయ్య,చేవ సూర్యనారాయణ,మేడిపోయిన శ్రీను,రామకుర్తి మూర్తి,జోస్యుల రాంబాబు,అడబాల నూకరాజు, సత్తి సోమరాజు,గెడ్డం రాంబాబు, అడబాల బాబి,అంకం గౌరీ శంకర్, రైతులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలు పండించాలి





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 08:**మండలం పుల్లేటికుర్రు రైతుసేవాకేంద్రం నందు ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ద్వారా ప్రకృతి వ్యవసాయం, నానో ఎరువుల వాడకం
భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, నూతన సాగు పద్దతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆత్మ చైర్మెన్ ఆరుమెల్లి సత్యసాయిబాబు అధ్యక్షతన జరిగింది.
ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు ఏవిఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్షలు ప్రతి రైతు చేయించు కోవాలని భూసార పరీక్షలు చేయించుకోవడం వలన పంటకు ఎరువుల మోతాదు
ఎంత అవసరమో సూక్ష్మ ధాతు లోపాలను కూడా ఈ పరీక్ష చెయ్యించడం ద్వారా సవరించు కోవచ్చు తెలియజేసారు. ఎరువుల యాజ్యమాన్య పద్ధతులు వివరించారు. రైతులకు తొలకరిలో నానో యూరియా, నాన్ డి.ఎ.పి యొక్క ఉపయోగాలు రైతులకు ఇన్సురెన్స్ ప్రకృతి వ్యవసాయంపై అవగావన కల్పించారు.
ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూసారం మెరుగు పడుతుంది. ప్రజల ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందన్నారు.
ఈ కార్యక్రమంనకు మండల వ్యవసాయ అధికారి కె. ధర్మప్రసాద్, అంబాజీపేట , డా॥బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా ఆత్మ డైరెక్టర్ పత్తి దత్తుడు, పుల్లేటికుర్రు సొసైటి చైర్మెన్ దొమ్మేటి సురేష్ కుమార్, ఆత్మ మెంబర్ పుల్లేటికుర్రు కోట మురలీధర్ , బీరుసు రాజా, బట్టు –
సత్యనారాయణ, వీరా రవి అయ్యగారి శ్రీనివాసరావు రైతు నాయకులు, చిట్టూరి హరికృష్ణ, మర్రిరామకృష్ణ, నూకపెయ్యి సత్యనారాయణ వర్మ
మరియు ఏఈడి జాంబెజ్ శాస్త్రి విఏఏ లావణ్య,విహెచ్ఏ నవ్య, ప్రకృతి వ్యవసాయి సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## యల్లమిల్లిలో ఎస్ ఐ ఆర్ ఓటర్ సర్వే వేగం పెంచిన టిడిపి





**జూలై 14 గడువులోపు 100% నమోదు లక్ష్యం**

**గండేపల్లి, పెన్ పవర్, జూలై 0 8:** గండేపల్లి జూలై 8:గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ ఓటర్ లిస్ట్ సర్వే ముమ్మరంగా జరుగుతోంది. టిడిపి గ్రామ అధ్యక్షులుసుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో బిఎల్వోలు, బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఓటర్ నమోదు, ధృవీకరణ ప్రక్రియ చేపట్టారు– బూత్ 100:లి 77% పూర్త– బూత్ 101:లి 82% పూర్తి – బూత్ 102:లి 72% పూర్తి
గ్రామ మొత్తం:లి ఇప్పటికే 75% నమోదు పూర్తి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు యల్లమిల్లిలో ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. గ్రామ టిడిపి క్యాడర్, బిఎల్వోలు, బిఎల్ఏలు కలిసి రోజూ ఫీల్డ్‌లో తిరుగుతూ ప్రతి ఇంటిని కవర్ చేస్తున్నారు.
కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
జూలై 14లోపు నూటికి నూరు శాతం ఓటర్ నమోదు పూర్తి చేయడమే టార్గెట్.
ఈ సందర్భంగా సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ముఖ్యం. మిగిలిన 25% పనిని వారం రోజుల్లో పూర్తి చేసి యల్లమిల్లిని 100% ఓటర్ నమోదు గ్రామంగా నిలబెడతాం. ఎవరి పేరు విడిచిపెట్టకుండా అందరి ఓట్లు నమోదయ్యేలా చూస్తాం" అని తెలిపారు.
గ్రామంలో ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే బిఎల్వోలను సంప్రదించి జూలై 14లోపు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మద్దిపూడి వీర వెంకట సత్యనారాయణ, దేవిశెట్టి బాబ్జి బిఎల్వోలు బిఎల్ఎ లు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జొన్నాడలో ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు.



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 08;**మండలలోని జొన్నాడ గ్రామంలో దివంగత నేత,మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను బుధవారం గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్ సెల్ కార్యదర్శి నాంద్ర నాగమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నాయకులతో కలిసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్టా శ్రీనివాస్, తాడి మెహర్ ఆదిత్య రెడ్డి, గొలుగూరి సూర్రెడ్డి, నంగెద్ద రంగారావు గౌడ్, వెలగల మౌళి ప్రకాష్ రెడ్డి,సత్తి ప్రదీప్ రెడ్డి, పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జూలై 14తో గడువు - "ఓటే ప్రజాస్వామ్యానికి ఆయుధం"...

## జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహ



**గండేపల్లి, పెన్ పవర్, జూలై 08**
ఓటర్ నమోదుకు చివరి తేదీ జూలై 14. సమయం తక్కువగా ఉండడంతో మల్లేపల్లి గ్రామంలో టిడిపి–జనసేన కూటమి నాయకులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు.
జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ కోఆర్డినేటర్ రామకుర్తి నరసింహ టిడిపి సీనియర్ నాయకులు కాటేపల్లి భద్ర రావుఆధ్వర్యంలో బిఎల్ఓలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటు నమోదు చేయిస్తున్నారు.
రామకుర్తి నరసింహ మాట్లాడుతూ
ఓటే శక్తి ఓటు అనేది ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారానే వస్తుంది
భవిష్యత్ కోసం మీ పిల్లల భవిష్యత్, గ్రామ అభివృద్ధి, రోడ్లు, నీళ్లు, విద్య అన్నీ ఓటు మీదే ఆధారపడి ఉంటాయి. అందుకే ఒక్క ఓటు కూడా వృధా కాకూడదు."
యువతకు పిలుపు18 ఏళ్లు నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలి. దేశ నిర్మాణంలో మీ భాగస్వామ్య ఉండాలి
చివరి అవకాశం జూలై 14తో గడువు ముగుస్తుంది. తర్వాత అవకాశం ఉండదు. ఈరోజే మీ పేరు లిస్టులో ఉందో లేదో చెక్ చేసుకోండి."
కాటేపల్లి భద్ర రావు మాట్లాడుతూ
"టిడిపి–జనసేన కూటమి ప్రజా ప్రభుత్వం కోసం పని చేస్తుంది. ఆ లక్ష్యానికి ప్రతి ఒక్కరి ఓటు అవసరం. ఎవరి పేరు మిస్ కాకుండా నమోదు చేయించుకోండి."
ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొడవర్తి బాబికి పితృవియోగం




**ఆలమూరు, పెన్ పవర్, జూలై 08;**ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి) తండ్రి గొడవర్తి సూర్యనారాయణ (అబ్బు–-85) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళు లర్పించారు. కూటమి నాయకులు, కొత్తపేట నియోజకవర్గం కమ్మ సంఘం సభ్యులు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు బాబి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సూర్యనారాయణ మృతి చెందిన విషయం తెలుసుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బాబి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సూర్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగపరుచుకోవాలి-సిఐ భీమరాజు



**అంబాజీపేట,ఎన్ పవర్, జులై 08:**ఈనెల 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు అందరూ సద్వినియోగ
పరచుకోవాలని పి. గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు పిలుపు నిచ్చారు. అంబాజీపేటలో గల తన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. రాజీయేరాజమార్గమని, లోక్ అదాలత్ తో వివాదాలకు ముగింపు
పలకాలని హితవు పలికారు. దీంతో వివాదంలో ఉన్న
ఇరుపక్షాల వారు నూతన సంబంధాలకు తెర తీసినట్లు
సత్యమేవ జయతి అవుతుందని అన్నారు. కేసుల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఇరు పక్షాలకు వివరించి,
పరస్పర అవగాహన, చర్చలు, రాజీ ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి కోర్టు ఫీజులు లేకుండా,
తక్కువ సమయంలో, సామరస్యపూర్వకంగా వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందే అవకాశం ఉందని అన్నారు. వివిధ వివాదాలలో ఉన్న వారు ఈ విలువైన అవకాశాన్ని వినియోగిం చుకుని తమ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలి అని కోరారు. ఎటువంటి కోర్టు ఫీజు ఉండదని కొన్ని కేసులలో చెల్లించిన ఫీజు కూడా తిరిగి రావడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ లో తీర్పు కోర్టు డిక్రీతో సమానమై చట్టబద్ధత కలిగి ఉంటుందని వివరించారు. సాధారణంగా ఆ తీర్పుపై అప్పీల్ కూడా ఉండదన్నారు

## అంబాజీపేట లో వైఎస్ రాజశేఖరరెడ్డి వేడుకలు




**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 08:** మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మేటి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ. జయంతి కార్యక్రమం అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహము వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాజశేఖర్ రెడ్డి పాలనలో ఉన్నంతకాలం రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు అత్యధికంగా మేలు జరిగిందని పేద పిల్లలు విద్య కొరకు ఫీజు రీయింబర్స్ మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108, 104 వైద్య సేవలు, రైతులకు వ్యవసాయ రుణమాఫీ, వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ములపర్తి మోహన రావు, మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, ఆదుర్తి నారాయణమూర్తి, బొంతు శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

